# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 16-03-2026** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. అమరజీవి పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహాన్ని అమరావతిలో ఆవిష్కరించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు .

2. తెలుగు భాష, సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించిన కేంద్రమంత్రి పెమ్మసాని చంద్ర శేఖర్.

3. ప్రభుత్వ యంత్రాంగం అంతా ఒకే చోట ఉండేలా అమరావతిలో విభాగాధిపతుల కార్యాలయాలను  నిర్మిస్తున్నామన్న మంత్రి పి.నారాయణ.

4. టీకాలపై అవగాహన కల్పించే లక్ష్యంతో జాతీయ టీకా దినోత్సవాన్ని  ఈ రోజు నిర్వహిస్తున్నారు.

===========================

అమరావతిలో అమరజీవి పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహాన్ని  ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు ఆవిష్కరించారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం 58 రోజుల ఆమరణ నిరాహార దీక్షకు గుర్తుగా,  ఆయన 125వ జయంతి ఉత్సవాలలో భాగంగా 58 అడుగుల కాంస్య విగ్రహాన్ని  పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో  ముఖ్యమంత్రితో పాటు ఉపముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్, కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌లతో పాటు రాష్ట్ర మంత్రులు, బిజేపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్. మాధవ్ పాల్గొన్నారు.

-------------------------

ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం ఆమరణ నిరాహార దీక్షతో ప్రాణత్యాగం చేసి, దేశంలో భాషా ప్రయుక్త రాష్ట్రాలకు పునాది వేసిన మహనీయులు  శ్రీపొట్టి శ్రీరాములు అని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా  కేంద్ర మంత్రి ఈ రోజు ఒక వీడియో సందేశంలో మాట్లాడుతూ, పొట్టి శ్రీరాములు త్యాగం తరతరాలకు స్ఫూర్తినిస్తుందని తెలిపారు. అమరావతిలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన 58 అడుగుల  "స్టాచ్యూ ఆఫ్ శాక్రిఫైస్"  విగ్రహం ఆవిష్కరణ  ఆంధ్రులందరికీ  గర్వకారణమని రామ్మోహన్ నాయుడు పేర్కొంటూ,

వాయిస్..25  సెకన్లు

-----------------------------

తెలుగు భాష ద్వారా సంస్కృతి, సంప్రదాయాలను, చరిత్రను భావితరాలకు అందించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్ర శేఖర్ తెలిపారు. తమిళనాడులోని చెన్నైలో ఒక సంస్థ నిర్వహించిన ఉగాది పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమంలో కేంద్ర మంత్రి పాల్గొని అవార్డు గ్రహీతలకు పురస్కారాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ద్రావిడ సంస్కృతిలో తెలుగు – తమిళ నాగరికతలు కీలక పాత్ర పోషించాయన్నారు. దేశ బాషలలో తెలుగు భాషకు విశిష్ట స్థానం ఉందని కేంద్రమంత్రి తెలియజేస్తూ,

వాయిస్ ..30.. సెకన్లు

-----------------------------

అమరావతిలోని ప్రభుత్వ యంత్రాంగం అంతా ఒకే చోట ఉండేలా విభాగాధిపతుల కార్యాలయాలను నిర్మిస్తున్నామని పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. అమరావతిలో హెడ్ ఆఫ్ డిపార్ట్‌మెంట్ హెచ్‌ఓడి టవర్ల నిర్మాణ పనులలో భాగంగా టవర్ –1 కు మొదటి స్టీల్ దయాగ్రిడ్ ను అమర్చే పనులను మంత్రి ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ, 53 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఐదు జీఏడీ భవనాల నిర్మాణం జరుగుతోందని తెలిపారు. 2028 నాటికి ఈ భవనాలను అందుబాటులోకి తెచ్చేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని మంత్రి వివరిస్తూ..

వాయిస్.. 30 సెకన్లు

-----------------------------

రాష్ట్రంలో వచ్చే నెల నుండి జాతీయ గృహ ఆదాయ గణన నిర్వహించనున్నట్లు జాతీయ గణాంకాల కార్యాలయం డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డి.సతీష్ తెలిపారు. గణనకు సంబంధించి జాతీయ గణాంకాల కార్యాలయ సిబ్బందికి నిర్వహిస్తున్న రెండు రోజుల కార్యశాలను విజయవాడలో ఆయన ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ, ఈ ఏడాది ఏప్రిల్ నుండి 2027 మార్చి వరకు జరిగే ఈ గణనలో కుటుంబాల సభ్యుల వివరాలు, వేతనాలు, జీతాలు, పనులు, స్వయం ఉపాధి, పింఛన్ ఇతర ఆదాయ వనరుల వివరాలను సేకరిస్తామని చెప్పారు. దేశంలో వివిధ ప్రాంతాలు, సామాజిక వర్గాల మధ్య ఆదాయ పంపిణీని, ఆర్థిక అసమానతలను అంచనా వేయడం ఈ గణన ప్రధాన లక్ష్యమని ఈ కార్యక్రమానికి ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

-----------------------------

వివిధ రకాల వ్యాధుల నుండి రక్షణ కల్పించేందుకు టీకాలు ఏ విధంగా సహాయ పడతాయనే అంశంపై అవగాహన కల్పించేందుకు ఈ రోజు జాతీయ టీకా దినోత్సవం నిర్వహిస్తున్నారు. అమెరికాకు చెందిన ప్రముఖ వైద్య పరిశోధకులు జోనస్ ఎడ్వర్డ్ సాల్క్ 1995 మార్చి 16 వ తేదీన పోలియో కోసం మొదటి సారిగా టీకా అభివృద్ధి చేశారు. భారత దేశంలో కూడా అదేరోజు మొదటిసారి నోటి ద్వారా తీసుకునే పోలియో టీకాను ఇచ్చారు. అప్పటి నుండి ప్రతి సంవత్సరం మార్చి 16వ తేదీన జాతీయ టీకా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. జాతీయ టీకా దినోత్సవం సందర్భంగా వైద్యులు, ఇతర వైద్య నిపుణులు టీకాలు తీసుకోవడం వల్ల కలిగే లాభాలు, తీసుకోకపోవడం వల్ల జరిగే నష్టాలపై ఈరోజు అవగాహన కల్పిస్తున్నారు.

---------------------------

గృహ వంట అవసరాలకు ఎల్పీజీ గ్యాస్ సిలిండర్లు సమయానికి అందడం పట్ల శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారు. గ్యాస్ కోసం నమోదు చేసుకున్ననిర్ణీత సమయంలోనే సిలిండర్ అందిందని తమకు ఎలాంటి ఇబ్బంది కలగలేదని చెబుతున్నారు. గ్యాస్ సరఫరా విషయంలో అపోహలు, వదంతులు వ్యాపిస్తున్న నేపథ్యంలో వాటిని వినియోగదారులు నమ్మవద్దని నెల్లూరు జిల్లాలోని జలదంకి గ్రామానికి చెందిన పద్మ తెలియజేస్తూ..

వాయిస్..30.. సెకన్లు

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్” మనసులోని మాట కార్యక్రమం 132 వ సంచిక ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది.“మన్ కీ బాత్” కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 టోల్ ఫ్రీ నెంబర్‌కు, మై జి.ఓ.వి.ఇన్ వెబ్‌సైట్ కు ఈ నెల 27వ తేదీ వరకు పంపవచ్చు.

---------------------------

మంగళగిరిని స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దేందుకు “స్వచ్ఛ మంగళగిరి 2.0” కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ అదనపు కమీషనర్ కె. శకుంతల అన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరి–తాడేపల్లి మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో గల కొప్పురావూరు కాలనీలో నిర్వహించిన స్వచ్ఛభారత్ కార్యక్రమంలో ఆమె ఈ రోజు పాల్గొని పరిశుభ్రతపై అవగాహన కలిగిస్తూ స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శకుంతల మాట్లాడుతూ, డ్రైన్ల పూడికతీత, ఇళ్ళ నుంచి చెత్త సేకరణ, ప్రజలలో అవగాహన పెంపొందించడం ద్వారా మంగళగిరిని వ్యర్థ రహితంగా తీర్చిదిద్దుతున్నామని అన్నారు. స్వచ్ఛ మంగళగిరి కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని సూచించారు.

---------------------------

అనంతపురం జిల్లాలోని గుత్తి కోటను ప్రముఖ పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తున్నామని గుంతకల్లు శాసనసభ్యులు గుమ్మనూరు జయరాం అన్నారు. జిల్లాలోని గుత్తిలో రెండు రోజులపాటు నిర్వహించిన “గుత్తి కోట ఉత్సవాలు” ముగింపు కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, అనంతపురం శాసనసభ్యుడు దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ తో కలిసి ఆయన నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా జయరాం మాట్లాడుతూ, చారిత్రక కట్టడమైన గుత్తి కోట పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. కోట విశిష్టతను, సంప్రదాయాలను, వారసత్వం భావితరాలకు తెలియజేసేలా గుత్తి కోట ఉత్సవాలు ప్రతి ఏటా నిర్వహిస్తామని తెలిపారు.

---------------------------

రంజాన్ మాసం క్రమశిక్షణకు, దాతృత్వానికి ప్రతీక అని రహదారులు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అన్నారు. నంద్యాల జిల్లా బనగానపల్లెలోని జుమ్మా మసీదులో నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఆయన నిన్న పాల్గొన్నారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం మంత్రి మాట్లాడుతూ, మత సామరస్యాన్ని పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం

కట్టుబడి ఉందని మంత్రి పేర్కొన్నారు.

--------------------------

అమరావతిలోని ప్రభుత్వ యంత్రాంగం అంతా ఒకే చోట ఉండేలా విభాగాధిపతుల కార్యాలయాలను నిర్మిస్తున్నామని పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. అమరావతిలో హెడ్ ఆఫ్ డిపార్ట్మెంట్ నూణ టవర్ల నిర్మాణ పనులలో భాగంగా టవర్ -1 కు మొదటి స్టీల్ డయాగ్రిడ్ ను అమర్చే పనులను మంత్రి ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ, 53 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఐదు జీఏడీ భవనాల నిర్మాణం జరుగుతోందని తెలిపారు. 2028 నాటికి అందుబాటులోకి ఈ భవనాలను అందుబాటులోకి తెచ్చేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని మంత్రి వివరించారు.

======================